క్లుప్తంగా

దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

పాతమంచిర్యాల: జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం సమ్మె కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబించడం, కార్పొరేట్ రంగాలకు లబ్ధిచేకూర్చడం, కార్మికుల హక్కులను హరించేలా నిర్ణయాలు తీసుకోవడంపై మండిపడ్డారు. కార్మికులు, రైతులు, మేధావులు, విద్యార్థులు ఈ సమ్మెలో పాల్గొనాలని కోరారు. సీఐటీయూ నాయకులు దోసండ్ల ఎల్లయ్య, పోశం, రమేశ్, ఉమారాణి, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు కళాశాల విద్యార్థులకు ఊరట

మంచిర్యాలఅర్బన్: స్థానిక ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఊరట లభించింది. రెగ్యులర్ డేటా, రికార్డుల బదిలీ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అందుబాటులో ఉంచాలని బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ విద్య జాయింట్ సెక్రెటరీ శుక్రవారం డీఐఈవోకు ఆదేశాలు జారీ చేశారు. విద్యాసంవత్సరం ప్రారంభమైనా కళాశాలకు తాళం వేసి ఉండడంతో విద్యార్థులు ఆందోళన చెందారు. ఉన్నత చదువులకు వెళ్లే విద్యార్థులు సర్టిఫికెట్ కోసం కళాశాల చుట్టూ తిరగాల్సి వచ్చింది. యాజమాన్యంపై చర్యల్లో భాగంగా డీఐఈవో అంజయ్య నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో టీజీబీఐఈ అకాడమిక్ ప్రతిభ జూనియర్ కళాశాల సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మంచిర్యాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఒకట్రెండు రోజుల్లో విద్యార్థుల సర్టిఫికేట్ల పంపిణీ ఉంటుందని డీఐఈవో అంజయ్య తెలిపారు.

క్షేత్ర పర్యటన.. ప్రత్యక్ష బోధన



పోలీసుల విధులను గురించి వివరిస్తున్న సీఐ రమణామూర్తి

దండేపల్లి: మండలంలోని గుడిరేవు ప్రాథమిక పాఠశాల విద్యార్థులను హెచ్ఎం బుచ్చన్న, ఉపాధ్యాయురాలు శ్యామల శుక్రవారం మండల కేంద్రానికి క్షేత్రపర్యటనకు తీసుకువచ్చారు. పోలీసుస్టేషన్, మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాలు, గ్రామీణ బ్యాంకు, పశువైద్యశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తపాలా కేంద్రం, ఆధార్ నమోదు కేంద్రాలను సందర్శించారు. అక్కడే వారికి వాటిని గురించి ప్రత్యక్ష అవగాహన కల్పించారు. పోలీసుస్టేషన్‌లో సీఐ రమణామూర్తి, ఎస్సై తహసీనొద్దీన్, పోలీసుల విధులు గురించి వివరించారు. ప్రభుత్వ సంస్థలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు హెచ్ఎం బుచ్చన్న తెలిపారు.

నర్సింగాపూర్‌లో పొలంబాట



రైతులతో విద్యుత్ అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధి నర్సింగాపూర్‌లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పొలాల్లో వంగిన స్తంభాలను సరిచేసి విద్యుత్ తీగలు కిందకు వేలాడకుండా పనులు చేపట్టారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

భీమారం: చెన్నూర్ నియోజకవర్గంలో అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందని ఆపార్టీ జిల్లా నాయకుడు ఆవిడపు రవితేజ తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో గత ప్రభుత్వం ఎన్ని డబుల్ బెడ్రూం ఇళ్లు ఇచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందన్నారు. నాయకులు బోగె సమ్మయ్య, అలకాటి తిరుపతి, సందనవేని అజయ్, అంగడి రాజం, ప్రసాద్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తం

- ఎక్కడ పడితే అక్కడే చెత్త
- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- డీజిల్ పోయించేందుకు నిధులు లేవు
- మూలనపడ్డ పంచాయతీ ట్రాక్టర్లు
- పట్టించుకోని అధికారులు



రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

భీమారం: మండలంలోని 11 పంచాయతీల్లో నిధుల కొరత వేధిస్తోంది. ఈ కారణంగా పల్లెల్లో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. ఎటు చూసిన చెత్తాచెదారం దర్శనమిస్తోంది. మురుగుకాల్వల్లో పూడిక నిండి ఉంటోంది. వర్షాలకు నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెందుతున్నాయి. తీవ్ర దుర్వాసన రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీలకు గతంలో ట్రాక్టర్లు, పారిశుద్ధ్య కార్మికులను కేటాయించడంతో పంచాయతీల దశ మారుతుందని అందరూ భావించా రు. పంచాయతీకి ట్రాక్టర్‌తోపాటు మొక్కలను నీటిని అందించేందుకు ట్యాంకర్ కొనుగోలు చేశారు. వాటి అప్పులను జీపీల ద్వారానే చెల్లిస్తుండంతో పంచాయతీలు రానురాను డీలాపడ్డాయి. ప్రస్తుతం డీజిల్ పోసేందుకు నిధులు లేక ట్రాక్టర్లు మూలనపడ్డాయి. తడి, పొడి చెత్త సేకరించి ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డులకు తరలించే పనులు నిలిచిపోయాయి. గత మూడు నెలలనుంచి పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదు. దీంతో వారు పనిచేసేందుకు వెనుకంజ వేస్తున్నారు. సర్పంచుల పదవీకాలం పూర్తికావడంతో కేంద్రప్రభుత్వం అప్పటివరకు ఇచ్చిన నిధులను క్రమక్రమంగా నిలిపివేసింది. దీంతో పంచాయతీల పరిస్థితి అధ్వానంగా మారింది. మురుగుకాలువల్లో చెత్త తొలగింపు పనులు నిలిపివేశారు. అత్యవసరం ఉంటేనే అక్కడ పనులు చేపడుతున్నారు.

వ్యాధులు ప్రబలే అవకాశం

గ్రామాల్లో చాలావరకు పారిశుద్ధ్యం లోపించింది. మరోవైపు వర్షాకాలం ప్రారంభం కావడంతో గ్రామాల్లో దోమలు వ్యాప్తి చెంది వ్యాధులు ప్రబలే అవకాశం ఏర్పడింది.

పట్టించుకోవడం లేదు



గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. పరిసరాలు కంపుకొడుతున్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదు. పంచాయతీలకు నిధులు కేటాయించి స్వచ్ఛ గ్రామాలుగా మార్చాలి.

– తగరం శ్రీనివాస్, భీమారం

నిధుల కొరత ఉంది



పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు నిధుల కొరత తీవ్రంగా ఉంది. భీమారం పంచాయతీలో ట్రాక్టర్‌కు డీజిల్ పోసిన పెట్రోల్ పంప్‌కి రూ.లక్షకి పైగా బకాయి ఉన్నాం. డీజిల్ పోయనందున ట్రాక్టర్‌ను పక్కన పెట్టేశాం. పారిశుద్ధ్య కార్మికులకు మూడు నెలల వేతనం రాలేదు. వారిపై పని ఒత్తిడి చేయలేకపోతున్నాం.

– సతీశ్‌రెడ్డి, ఎంపీవో

కన్నెపల్లిలో సామాజిక తనిఖీ



మాట్లాడుతున్న డీఆర్‌డీవో కిషన్

భీమిని: గ్రామాల్లో ఉపాధిహామీ పథకం పారదర్శకంగా, నిబంధనల ప్రకారం అమలు చేసేందుకే ఏటా సామాజిక తనిఖీ నిర్వహించి ప్రజావేదికలో సమీక్షిస్తున్నట్లు డీఆర్‌డీవో కిషన్ అన్నారు. శుక్రవారం కన్నెపల్లి మండలంలోని రైతువేదికలో 4వ విడత సామాజిక తనిఖీ ఉపాధిహామీ ప్రజావేదిక నిర్వహించారు. 2024–25 సంవత్సరానికిగాను మండలంలోని 15 పంచాయతీల్లో సుమారు రూ.4 కోట్ల 12 లక్షలతో వివిధ పనులు చేపట్టారు. పలు గ్రామాల్లో పనుల్లో అవకతవకలు జరిగినందున వారికి రూ.16 వేల జరిమానా, రూ.2,29,416 రికవరీకి ఆదేశించారు. అదేవిధంగా గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న పనులు పది రోజుల్లో పూర్తి చేయాలని లేకుంటే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈజీఎస్ విజిలెన్స్ అధికారి కిరణ్, ఎంపీడీవో శంకర్, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో శ్రీనివాస్, ఎస్ఆర్పీ సాయిలు, ఈసీ సుధాకర్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, తనిఖీ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

డీఆర్‌డీవోకు కార్యదర్శుల వినతి..

డీఆర్‌డీవో కిషన్‌కు కన్నెపల్లి మండల పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. 15 గ్రామాల్లో ఈజీఎస్ పనుల్లో పంచాయతీల తీర్మానం లేకుండా నేమ్‌బోర్డులు, ఇతర పనులకు సంబంధించి రూ.4,16,460 ప్రైవేట్ వ్యక్తి పేరిట ఖాతాలో జమ చేశారన్నారు. మరో రూ.1,41,718 మరో జమ కావాల్సి ఉందని, కానీ ఫీల్డ్‌లో పని జరగలేదన్నారు. గ్రామ పంచాయతీలకు సంబంధం లేకుండా చెల్లింపులు జరిపిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతిలో పేర్కొన్నారు.

‘బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యం’

రామకృష్ణాపూర్: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో జరిగిన అభివృద్ధి శూన్యమని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, నాయకుడు రఘునాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి అనేది శిలాఫలకాలకే పరిమితమైందన్నారు. చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి గెలిచాక అనేక పనులకు శ్రీకారం చుట్టి పూర్తిచేయించారని అన్నారు. నేతలు శ్రీనివాస్, కనకరాజు, సురేశ్ పాల్గొన్నారు.

కార్యదర్శులకు శిక్షణ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. రెండ్రోజుల శిక్షణలో భాగంగా మొదటి రోజు పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం కోసం సమాచార హక్కు చట్టం, గ్రామసభల నిర్వహణ, గ్రామీణ మౌలిక సదుపాయాల నిర్వహణలో గ్రాయ పంచాయతీల పాత్ర తదితర అంశాలపై అవగాహన కల్పించారు. డీపీఓ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ జిల్లాలోని కార్యదర్శులకు విడతల వారీగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

అడవి దున్న హల్‌చల్



అటవీ అధికారులకు చిక్కిన అడవి దున్న ఫొటో

వేమనపల్లి: వేమనపల్లి ప్రాణహితనది తీరం వెంట అడవి దున్న(ఇండియన్ బైసన్) హల్‌చల్ సృష్టించింది. దొండ్లరేవు వద్ద పత్తి చేలల్లో ఆకస్మాత్తుగా ప్రత్యక్షం కాగా రైతులు వేమనపల్లి డెప్యూటీ రేంజ్ అధికారి రూపేష్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన బేస్ క్యాంపు సిబ్బంది రవి, మహేశ్‌లను అటవీ దున్న సంచరిస్తున్న ప్రాంతానికి పంపారు. పెద్దరేవు వైపు నుంచి దయ్యాలమర్రి వద్దకు వచ్చి తిరిగి వెళ్లిపోయింది. పాతకల్మలపేట వైపు వెళ్లడంతో నీల్వాయి రేంజ్ సిబ్బందికి సమాచారమిచ్చారు. అప్రమత్తమైన చెన్నూర్ ఎఫ్‌డీవో ప్రసాద్ ఆధ్వర్యంలో కోటపల్లి రేంజ్ అధికారి సదానందం, వేంచపల్లి ఎఫ్‌బీవో, నీల్వాయి డెప్యూటీ రేంజ్ అధికారి ప్రమోద్‌కుమార్, ఎఫ్‌బీవో మహిపాల్, బేస్ క్యాంపు సిబ్బంది రాజేష్ బృందాలుగా ఏర్పడి ట్రాకింగ్ చేస్తూ కదలికలపై ఆరా తీశారు. పాత కేతన్‌పల్లి సమీపంలో ప్రాణహిత నీల్వాయి వాగు ముంపు ప్రాంతం నుంచి అక్కడ కలిసిన గేదెల మందలో కలిసింది. అనంతరం ముల్కలపేట వైపు నుంచి కోటపల్లి రేంజ్ అడవుల్లోకి వెళ్తున్నట్లు అధికారులు నిర్ధారణకు వచ్చారు.

ఎమ్మెల్సీ కోదండరామ్‌కు సన్మానం



సన్మానిస్తున్న ఆర్డీవో శ్రీనివాసరావు, కార్పొరేషన్ కమిషనర్ శివాజీ, సిబ్బంది

మంచిర్యాలటౌన్: తెలంగాణ ఉద్యమకారుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ శుక్రవారం వ్యక్తిగత పనిపై మంచిర్యాల ఆర్డీవో కార్యాలయానికి రాగా, ఆయన్ను ఆర్డీవో శ్రీనివాసరావు, సిబ్బంది సన్మానించారు. అనంతరం టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి..ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించిన సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించి, సీఎంతో చర్చిస్తానని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శివాజీ, ఆర్డీవో కార్యాలయ ఏవో బి.రాంచందర్, సిబ్బంది పద్మశ్రీ, అరుణ, లక్ష్మి, రవికిశోర్, జనార్దన్, సతీశ్, మహేందర్, సదయ్య, స్వప్నరెడ్డి పాల్గొన్నారు.

పార్ట్ టైమ్ స్వీపర్ల వేతనాలు పెంచాలి



వినతిపత్రం అందజేస్తున్న పార్ట్ టైమ్ స్వీపర్లు

తాండూర్: గ్రంథాలయాల్లో పనిచేస్తున్న పార్ట్ టైమ్ స్వీపర్ల వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని పలువురు పార్ట్‌టైమ్ స్వీపర్లు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో జరిగిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్‌కు పార్ట్‌టైమ్ స్వీపర్లు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా జారీ చేసే ఉద్యోగాల నోటిఫికేషన్‌లో అర్హత కలిగిన పార్ట్‌టైమ్ స్వీపర్లకు అవకాశం కల్పించాలన్నారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్ సానుకూలంగా స్పందించి సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన పార్ట్ టైమ్ స్వీపర్లు స్వామి, మధుకర్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇందన్‌పల్లి రేంజ్‌లో ఎఫ్‌డీవో పర్యటన



వివరాలు తెలుసుకుంటున్న ఎఫ్‌డీవో రామ్మోహన్

జన్నారం: ఇందన్‌పల్లి అటవీ రేంజ్‌లో ఎఫ్‌డీవో రామ్మోహన్ శుక్రవారం పర్యటించారు. రేంజ్ పరిధిలో చేసిన అభివృద్ధి పనులు, అడవులను పరిశీలించారు. నూతనంగా నిర్మించిన యాంటీపోచింగ్ షెడ్లను పరిశీలించారు. ఘనిషెట్టి కుంట, బర్తన్‌పేట్ బేస్‌క్యాంపు ప్రాంతాల్లో గడ్డి క్షేత్రాలు, నీటి కుంటల వివరాలను తెలుసుకున్నారు. రాత్రి, పగలు అలర్ట్‌గా ఉండాలని, స్మగ్లింగ్ జరగకుండా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఇక్కడ చేపడుతున్న అభివృద్ధి పనులు, సిబ్బంది విధులను రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ ఆయనకు వివరించారు. సెక్షన్ అధికారి హన్మంతరావు, బీట్ అధికారి రుబీనా తదితరులు ఉన్నారు.

జీఎం(సోలార్)కి సన్మానం



జానకిరాంను సన్మానిస్తున్న ఎస్టీపీపీ అధికారులు, ఉద్యోగులు

జైపూర్: సింగరేణిలో 39 ఏళ్ల వివిధ ఏరియాల్లో, హోదాల్లో విధులు నిర్వర్తించి కార్పొరేట్ జనరల్ మేనేజర్(సోలార్)గా ఈనెల 30న పదవీ విరమణ చేయనున్న జీఎస్.జానకిరాంను ఎస్టీపీపీ అధికారులు సన్మానించారు. ఎస్టీపీపీ అడ్మిన్ భవనకార్యాలయంలో శుక్రవారం ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులు, ఏజీఎంలు నరసింహారావు, వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్, సీఎంవోఏఐ బ్రాంచి ప్రెసిడెంట్ సముద్రాల శ్రీనివాస్, ఏజీఎం మురళీధర్, మదన్‌మోహన్, కిరణ్‌బాబు పాల్గొన్నారు.

ఎస్టీపీపీ ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల నూతన కమిటీ ఎన్నిక

జైపూర్: జైపూర్ ఎస్టీపీపీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. ఎస్టీపీపీ ఎస్సీ లైజన్ ఆఫీసర్‌గా వెంకటయ్య, చీఫ్ అడ్వైజర్‌గా జనగామ శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్‌గా పులి సురేశ్ తోపాటు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులను కలిసి సన్మానించారు. ఎస్టీపీపీ ప్రధాన గేటు ముందు బీఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్టీ ఎంప్లాయీస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పంతులా, తదితరులు పాల్గొన్నారు.

■ **బొగ్గుబాయి వార్తలు**

నాసిరకం పనిముట్ల సరఫరా

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని అనేక గనుల్లో కార్మికులకు నాసిరకం పనిముట్లు సరఫరా అవుతున్నాయని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి షేక్ బాజీసైదా తెలిపారు. శుక్రవారం ఆయన ఎస్ఆర్పీ–1 గనిని సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ కార్మికులు ఉపయోగించే చెమ్మస్‌లు నాణ్యతగా ఉండడం లేదన్నారు. డ్రిల్‌బిట్లు, డ్రిల్ రాడ్లు నాసిరకంగా వస్తున్నాయన్నారు. గనిలో వెంటిలేషన్ సమస్యతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అధికారులు త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని కోరారు. యూనియన్ పిట్ కార్యదర్శి దాడి రాజయ్య, సహాయ కార్యదర్శి పరశురాం, నాయకులు అనంతరెడ్డి, బైరి శ్రీనివాస్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని పలు ఎరువులు, ఫర్టిలైజర్ షాపుల్లో డీఏవో కల్పన శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. విత్తనాలు కొనుగోలు చేసే ప్రతీ రైతుకు విధిగా బిల్లు ఇవ్వాలని పేర్కొన్నారు. నానో యూరియా ప్లస్ లిక్విడ్ ఫర్టిలైజర్(ద్రవ రూప ఎరువులు) వాడకం గురించి రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి కృష్ణ, ఏఈవోలు ఉన్నారు.

దరఖాస్తు చేసుకోండి

నెన్నెల: ఉపాధిహామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకానికి అర్హులైన చిన్న, సన్నకారు రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఏపీవో నరేశ్ సూచించారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఐదెకరాల్లోపు భూమి, ఉపాధిహామీ జాబ్‌కార్డు ఉన్న ప్రతి రైతు అర్హుడేనన్నారు. ఈ పథకం కింద మొక్కలు, నాటడం, నీటి వసతి కల్పించడం ఇతర నిర్వహణ ఖర్చుల కోసం ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తోందని తెలిపారు. మామిడి, బత్తాయి, సపోట, బాదాం, సీతాఫలం, దానిమ్మ, కొబ్బరి, జామ , మునగ, అల్లనేరేడు, డ్రాగెన్‌ఫ్రూట్, యాపిల్‌బేర్, సంత్ర, ఆయిల్ పామ్ లాంటి తోటలు పెంచుకోవచ్చన్నారు. మూడేళ్ల వరకు మొక్కల సంరక్షణకు ప్రభుత్వమే ఆర్థిక సాయం అందజేస్తుందని చెప్పారు. ఆసక్తి ఉన్న రైతులు పంచాయతీలు, ఎంపీడీఓ కార్యాలయాల్లో దరఖాస్తు చేసకోవచ్చన్నారు.

పంచాయతీ కార్మికుల ముందస్తు అరెస్ట్



నెన్నెల పోలీస్‌స్టేషన్‌లో పంచాయతీ కార్మికులు

నెన్నెల: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం హైదరాబాద్‌లో తలపెట్టిన చలో హైదరాబాద్ కమిషనరేట్‌కార్యక్రమానికి తరలివెళ్లడానికి సిద్ధంగా ఉన్నా గ్రామ పంచాయతీ కార్మికులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి అదుపులో తీసుకున్నారు. తెల్లవారుజామున కార్మికుల ఇళ్ల వద్దకు వెళ్లి వారిని స్టేషన్‌కు తీసుకెళ్లారు. తమ న్యాయమైన డిమాండ్ల కోసం హైదరాబాద్ కమిషనరేట్‌కు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న తమను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారని, నాలుగు నెలల నుంచి జీతాలు లేకుండా కడు పేదరికంలో బతుకుతున్నామన్నారు. అరెస్ట్ అయిన వారిలో కుమార్, సంతోష్, రాజు, చిలుకయ్య, రాజేషలు ఉన్నారు

తాండూర్: మండలంలో సీఐటీయూ శ్రేణులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం, శ్రేణులు మొగిళి, శంకర్, రాజేష్ తదితరులను అదుపులో తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు.

రేపు బీసీ చైతన్య సదస్సు

పాతమంచిర్యాల: బీసీల న్యాయమైన డిమాండ్ల సాధనలో భాగంగా జిల్లా కేంద్రంలోని చార్వాక భవన్‌లో ఆదివారం బీసీ చైతన్య సదస్సు నిర్వహిస్తున్నామని బీసీ రాజ్యాధికార సమితి జిల్లా కార్యదర్శి వేముల ఆశోక్ తెలిపారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం సదస్సు సన్నాహక సమావేశం నిర్వహించారు. బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై వారిని చైతన్య చేయడానికి బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో సదస్సు ఉంటుందని పేర్కొన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ చిరంజీవులు, సభ్యులు వేణుకుమార్, దాసోజు లలిత, ప్రొఫెసర్ వీరస్వామి హాజరవుతారని తెలిపారు. నాయకులు ప్రకాశ్, ప్రభాకర్, మహ్మద్ పాషా, సామాజిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ రాజేశం, సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకులు జైపాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



ఎన్నికైన అసోసియేషన్ కమిటీ సభ్యులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ఆటోరిక్షా వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తూముల నరేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో నస్పూర్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా భూపతి శ్రీను, మండల అధ్యక్షుడిగా బద్రి శివకుమార్, ఉపాధ్యక్షులుగా తిప్పారపు రమేశ్, చతాల రామన్న, మండల రాజు, ప్రధాన కార్యదర్శిగా డి.శ్రీనివాస్, కార్యదర్శులుగా ఎండీ షకీల్, ముంజం సంతోశ్, క్యాషియర్‌గా మాడుగుల శ్రావణ్, కార్యవర్గ సభ్యులుగా చొప్పదండి నర్సయ్య, ఓడ్నాల రాజయ్య, తిరుపతి, రమేశ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సభ్యులు అంకతి సత్తయ్య, రాజాగౌడ్, మల్లేశ్, చంద్రయ్య, రాజు, మహేశ్ పాల్గొన్నారు.

మంచిర్యాలవాసికి రాష్ట్రస్థాయిలో 16వ ర్యాంకు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా కేంద్రానికి చెందిన చల్లూరి శశాంక్ తెలంగాణ పీజీ ఈసెట్ (ఎం–టెక్)లో రాష్ట్రస్థాయిలో 16వ ర్యాంకు సాధించాడు. బయోమెడికల్ ఇంజినీరింగ్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 16వ ర్యాంకు సాధించడంతో పలువురు శశాంక్‌ను అభినందించారు. కాగా, శశాంక్‌కు సోదరుడు రోహన్, తల్లిదండ్రులు రుద్రమదేవి–మల్లికార్జున్ ఉన్నారు.

వసతిగృహాల సందర్శన

మంచిర్యాలటౌన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల వసతి గృహాల విద్యార్థులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్వీ నాయకులు ఆరోపించారు. బీఆర్ఎస్వీ బడిబాటలో భాగంగా పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శ్రావణ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వసతి గృహాల్లో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. విద్యార్థులకు నాసిరకం భోజనం పెడుతున్నారన్నారు. పట్టణంలోని నారాయణ పాఠశాలలో అధిక ఫీజులు వసూళ్లు చే స్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గఅధ్యక్షుడు వంశీకృష్ణ, మందమర్రి పట్టణ అధ్యక్షుడు ఎండీ ముస్తఫా, నాయకులు రమేశ్, రవీందర్, శేఖర్, ప్రశాంత్, షకీల్, సాయికిరణ్, మనోజ్, కళ్యాణ్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

నోటుబుక్‌ల పంపిణీ

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధి 7వ వార్డులోని ఒడ్డెపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుట్ట అభిషేక్, ఆదర్శ్‌లు బ్యాగులు, నోటుబుక్‌లను శుక్రవారం ఎంఈవో రాధాకృష్ణమూర్తితో పంపిణీ చేయించారు. హెచ్ఎం పి.శ్రీనివాస్, సీఆర్పీ పుప్పాల ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రామ సంఘాలను బలోపేతం చేయాలి

భీమిని: గ్రామ సంఘాలను బలోపేతం చేయాలని రాష్ట్ర సెర్ప్ అధికారి టి.రవీందర్ అన్నారు. భీమిని భారతమాత మండల సమాఖ్య కార్యాలయంలో నూతన పదాధికారులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాల సంస్థాగత నిర్మాణం, గ్రామ సంఘాల అవశ్యకత పనితీరు, ఓబీల విధులు తదితర గురించి వివరించారు. డీఆర్‌డీవో ఏపీఎం ప్రవీణ్, ఏపీఎం వసంత, సీసీ శోభ, లక్ష్మణ్, ఎంఎస్ఏ గంగారాం, సీవో ప్రశాంత్ పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం

చెన్నూర్: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ వ్యాయామం చేస్తే ఆరోగ్యంగా ఉంటారని సీఐ దేవేందర్‌రావు అన్నారు. పాత బస్టాండ్ ప్రాంతంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఏఎస్ ఫిట్‌నెట్ సెంటర్‌ను ప్రారంభించారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, వ్యాపారవేత్త నర్సాగౌడ్, సీనియర్ బాడీబిల్డర్ సప్దర్ అలీ పాల్గొన్నారు.

వేలం పాట

చెన్నూర్: చెన్నూర్ మదనం పోచమ్మ ఆలయ ఆవరణలో శీతల పానీయాలు, ఆట వస్తువులు, పూజ సామగ్రి విక్రయించేందుకు శుక్రవారం వేలం పాట నిర్వహించినట్లు ఈవో ముక్త రవి తెలిపారు. వేలాల ఈవో బల్లు రమేశ్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించగా గోదావరిఖనిలోని 8 ఇంక్లయిన్ ప్రాంతానికి చెందిన బొగె కిరణ్ రూ.2.05 లక్షలకు వేలం పాడి సొంతం చేసుకున్నారు.

అంతరపంటగా కంది వేసుకోవాలి

భీమారం: రైతులు తమ పత్తి చేలలో అంతర పంటగా కంది వేసుకోవాలని చెన్నూర్ ఏడీఏ ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని మద్దికల్ గ్రామపొలిమేరలో పత్తి విత్తనాలు నాటుతున్న వారితో శుక్రవారం ఆయన మాట్లాడారు. వర్షాలు కురుస్తున్నాయని, ఇది పత్తి విత్తనాలు నాటేందుకు అనుకూల వాతావరణమన్నారు. అదనం ఆదాయం కోసం పత్తిలో కంది వేసుకోవాలని రైతులకు సూచించారు. అదే విధంగా ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. ఏవో అత్తె సుధాకర్ తదితరులు ఉన్నారు.